# నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శుక్రవారం 17 మే 2024 | NIZAMABAD




కామారెడ్డి జిల్లా కేంద్రంలో మానవహారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు




కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నేతలు



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నేతలు



బాల్కొండ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

## దగా కాంగ్రెస్

# బోనస్‌పై తిరకాసు

- దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాల్సిందే..
- ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలని రైతుల డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో మిన్నంటిన నిరసనలు
- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటం
- హామీలు నెరవేర్చే వరకూ అన్నదాతకు అండగా ఉంటాం
- నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ నేతల ఆందోళన

**ధాన్యం కొనుగోళ్లలో జాప్యం...**
**అకాల వర్షానికి మొలకెత్తుతున్న ధాన్యం**
**తరుగు పేరిట మిల్లర్ల మోసం...**

ఇలా ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి కాంగ్రెస్ సర్కారు షాక్ ఇచ్చింది. పార్లమెంట్ ఎన్నికల ముందు వరకు వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎన్నికలు ముగియగానే మాట మార్చారు. సన్న వడ్లు పండించిన వారికే బోనస్ అంటూ రిక్తహస్తం చూపించారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ఆందోళనలకు పిలుపునిచ్చింది. గులాబీ బాస్ కేసీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలో రైతులు, పార్టీ శ్రేణులు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అన్నిరకాల వడ్లకు బోనస్ ఇచ్చే వరకూ రైతులకు మద్దతుగా పోరాడుతామన్నారు. కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ భరోసా

### కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది

**- గంప గోవర్ధన్, మాజీ విప్**

కామారెడ్డి, మే 16: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తెల్లారే ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే ఇస్తామనడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. రైతాంగాన్ని మరోసారి వంచించి మోసం చేయడం సిగ్గుచేటన్నారు. 55ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, పేదలను మోసం చేస్తూ వస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో రైతులకు అండగా ఉంటామన్నారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చే వరకూ పోరాటం ఆగదన్నారు. వచ్చే ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ కూడా చేయాలని డిమాండ్ చేశారు.

### సన్నవడ్లకే బోనస్ అనడం సిగ్గుచేటు

**-జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ దండు నీతూ కిరణ్**

ఖలీల్‌వాడి, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వడ్లు కొనకుండా చోద్యం చూడడంతోనే అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు గుండెలు బాదుకుంటున్నారని నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర్ మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. మొన్నటి వరకు బోనస్ ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ మాట మార్చారని, సన్నవడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి వడ్లబస్తాలు ఉంటున్నా ఎందుకు తరలించడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట.. ఎన్నికలు ముగిసిన తర్వాత మారిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపాన ప్రజలు, రైతులను తీవ్ర సంక్షోభంలో పడేశారన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పంటలకు బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

## లైంగిక వేధింపుల కేసులో..

# డీఎంహెచ్‌వో అరెస్టు

కామారెడ్డి, మే 16: వైద్యశాఖలో ఉన్నత స్థానంలో ఉంటూ తోటి ఉద్యోగినుల పట్ల బాధ్యతగా మెలగాల్సిన డీఎంహెచ్‌వోపై లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. రికార్డుల పేరిట తాకడం, విధుల పేరిట ఫోన్ చేసి వేధిస్తున్నాడంటూ ఇటీవల కామారెడ్డి జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్‌పై మహిళా వైద్యులు, సిబ్బంది పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర వైద్యాధికారి సైతం కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణ సమయంలో పలువురు మహిళా అధికారులు రాష్ట్ర వైద్యాధికారి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. కాగా బుధవారం సాయంత్రం దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై మహిళా అధికారులు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై ఏడు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం బెయిల్‌పై డీఎంహెచ్‌వో విడుదలైనట్లు సమాచారం.

# బొమ్మ..బంద్

సుభాష్‌నగర్, మే 16: రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్ల నిర్వాహకుల నిర్ణయం మేరకు జిల్లాలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు నేటి నుంచి పది రోజుల పాటు బంద్ చేస్తున్నట్లు జిల్లా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రతినిధి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు 32కు పైగా ఉన్న సింగిల్ థియేటర్లను మూసివేయనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగిల్ థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడంతో నష్టాలు వస్తున్నాయని, అందుకే సినిమా ప్రదర్శనలను రద్దు చేస్తున్నట్లు వివరించారు. ఈనెల 26 తర్వాత పునః ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. మల్టీప్లెక్స్‌లో మాత్రం సినిమా ప్రదర్శనలు కొనసాగుతాయి.

# 'హరిత'ం.. ఏమిటీ నిర్లక్ష్యం?

- నర్సరీల్లో మొలకెత్తని విత్తనాలు
- పట్టించుకోని అధికారులు

రామారెడ్డి, మే 16: రాష్ట్రాన్ని హరితవనంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో తొలకరి వర్షాలు కురవగానే మొక్కలు నాటాలనే ఉద్దేశంతో గ్రామానికో నర్సరీని ఏర్పాటు చేశారు. మరో 20రోజుల్లో హరితహారం కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల్లోని నర్సరీల్లో ముందస్తు ప్రణాళికతో మట్టిని తీసుకొచ్చి బ్యాగ్‌ఫిల్లింగ్ చేసి విత్తనాలు వేశారు. వేసవి, నర్సరీల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కరువై విత్తనాలు మొలకెత్తలేదు. మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో అంతంత మాత్రంగానే విత్తనాలు మొలకెత్తాయని, మిగతా జాగ్రత్త చర్యలు పాటించకపోవడంతో వచ్చిన మొలకలు సైతం ఎండిపోయాయి. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటాలంటే రెండు మీటర్ల పొడవు, అటవీ ప్రాంతాల్లో నాటాల్సిన మొక్కలు రెండు, మూడు ఫీట్ల ఎత్తు ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు కొత్తగా విత్తనాలు వేసినా అవి మొక్కలుగా మారేందుకు రెండు, మూడు నెలల సమయం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో నిర్వహించే హరితహారం కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి.



వజ్జేపల్లితండాలో ఖాళీగా దర్శనమిస్తున్న బ్యాగులు

**త్వరగా మొలకెత్తే విత్తనాలు వేస్తాం..**

నర్సరీల్లో నాటిన కొన్ని విత్తనాలు మొలకెత్తలేదు. వాటిస్థానంలో మరిన్ని విత్తనాలు వేస్తాం. 20-30 రోజుల్లో మొలకలు వచ్చే మొక్కల రకాలైన బొప్పాయి, మునగ లాంటి విత్తనాలు వేస్తాం.

**- సంతోష్‌కుమార్,**
**ఎంపీడీవో, సదాశివనగర్**

# ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపాలి

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

దోమకొండ/బీబీపేట, మే 16: అకాల వర్షాల కారణంగా ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. దోమకొండ, బీబీపేట మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూకం వేసి సిద్ధంగా ఉన్న ధాన్యపు బస్తాలను వెంటనే తరలించాలని, అందుకు అవసరమైన లారీలను కేంద్రాలకు పంపాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలున్నాయా అని నిర్వాహకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. మిల్లర్లు కూడా 24 గంటల్లోగా ధాన్యం దించుకునేలా పర్యవేక్షించాలని, ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన చేయాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం కాస్త చెడిపోయినా రైతుల పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి కోత విధించకుండా అన్‌లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీ చేయాలన్నారు. తహసీల్దార్లు, గిర్దావర్లు, సూపర్‌వైజర్లతోపాటు అధికారులు దగ్గరుండి కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 44,182 మంది రైతుల నుంచి రూ. 541కోట్ల విలువ గల 2 లక్షల 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.474 కోట్లు చెల్లించామని, ట్యాబ్ ఎంట్రీ కూడా 96 శాతం మేర పూర్తి చేశామని, త్వరలో మిగతా రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం, అధికారులు ఉన్నారు.



దోమకొండలో ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# జీవన్‌రెడ్డి మాల్ సీజ్

ఆర్మూర్‌టౌన్, మే 16 : ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి షాపింగ్ మాల్‌ను ఆర్టీసీ అధికారులు గురువారం సీజ్ చేశారు. గడువులోపు బకాయిలు చెల్లించని కారణంగా మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రధాన గేట్లకు తాళం వేశారు. వారం క్రితం జీవన్‌రెడ్డి మాల్‌కు వచ్చిన ఆర్టీసీ అధికారులు.. మాల్‌ను సీజ్ చేస్తామని మైక్ ద్వారా ప్రకటించారు. తాజాగా మళ్లీ గురువారం ఉదయం మాల్‌కు వచ్చిన అధికారులు సాయంత్రంలోపు ఖాళీ చేయాలని దుకాణదారులకు సూచించారు. వారు చెప్పినట్లుగానే సాయంత్రం వచ్చి సకాలంలో అద్దె చెల్లించని కారణంగా మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, ప్రధాన గేట్‌కు తాళం వేశారు.

# మోస్తరు వర్షం.. తడిసిన ధాన్యం

ఖలీల్‌వాడి/ భిక్కనూర్, మే 16: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్, దోమకొండ, నిజామాబాద్ జిల్లా చందూర్, డిచ్‌పల్లి తదితర ప్రాంతాల్లో అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లతోపాటు ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. నిజామాబాద్ నగరంలో గురువారం రాత్రి గంటపాటు వర్షం కురిసింది. రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షంతో నగరం చల్లబడింది. గత కొన్నిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు.. వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.



భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో గురువారం అకాలవర్షానికి తడిసిన ధాన్యం